# వంటింట్లో నూనె మంట

- నూనెల దిగుమతులపై కేంద్రం సుంకం పెంపు
- 12.5 శాతం నుంచి 32.5 శాతం వరకు పెంచిన ప్రభుత్వం
- లీటరుకు రూ.20 నుంచి రూ.25 పెరుగుదల



**తుగ్గలి :** కొద్ది రోజులుగా స్థిరంగా ఉన్న నూనెల ధరలు మరోసారి భగ్గుమన్నాయి. శనివారం మధ్యాహ్నం మూడు గంటల వరకు సాధారణ ధరలకు విక్రయించిన వ్యాపారులు ఒక్కసారిగా పెంచిన ధరలకు అమ్మడంతో వినియోగదారులకు అర్థం కాలేదు. శుద్ధి చేసిన ఎడిబుల్ ఆయిల్‌పై కేంద్ర ప్రభుత్వం 32 శాతానికి పైగా దిగుమతి సుంకం పెకంచడంతో ధరలకు రెక్కలొచ్చాయి. నూనె గింజల పంటలు సాగు చేసే రైతుల ప్రయోజనం కోసమే అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పరోక్షంగా ధరల పెరుగుదలకు కారణమైంది. లీటర్ నూనెపై ఏకంగా దాదాపు 30 శాతం ధరలు పెరగడంతో సామాన్యులను ఆందోళనకు గురి చేస్తోంది. సరైన పంటలు పండక రైతులు, కూలీలు, సంక్షేమ పథకాలు అందక పేద ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రస్తుత తరుణంలో పెరిగిన వంట నూనెల ధరలు మరింత కలవరపడేలా చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు అన్నదాతలకు తీవ్ర నష్టం మిగిల్చింది. ఈ సమయంలో కేంద్రం ముడి చమురు, శుద్ధిచేసిన చమురు దిగుమతిపై సుంకాన్ని 20 శాతానికి పెంచింది. శుద్ధిచేసిన నూనెలపై 13.75 నుంచి 35.75 శాతం వరకు పెంచింది. దీంతో వంట నూనెలు లీటరుపై దాదాపు రూ.25 నుంచి రూ.30 వరకు పెరిగాయి. శనివారం ఉదయం ఫ్రీడం ఆయిల్ 15 లీటర్ల క్యాన్ ధర రూ.1650 ఉండగా మధ్యాహ్నానికి రూ.1950కి చేరింది. అలాగే పామాయిల్ లీటర్ రూ.95 నుంచి రూ.100 ఉండగా నేడు రూ.130కి చేరింది. దీంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది.

### ధరలను నియంత్రించాలి



మాది సామాన్య రైతు కుటుంబం. వానలు సకాలంలో కురిసి పంటలు పండితేనే కుటుంబం గడుస్తుంది. లేకపోతే అప్పులతో నెట్టుకు రావాలి. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయాం. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ఏవీ కొనలేక పోతున్నాం. ఇప్పుడు మళ్లీ నూనెల ధరలు అమాంతంగా పెరిగాయి. నిత్యాసర సరుకుల ధరలు, నూనెల ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం ధరలను నియంత్రించాలి.

– అరవ వరలక్ష్మి, ముక్కెల్ల, తుగ్గలి

### పేదలపై భారం



ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగాయి. ఇప్పుడు వంట నూనెల ధరలు కూడా పెరగడంతో పేదలు ఏమీ కొనే పరిస్థితి లేకుండా పోతోంది. పంటలు కూడా సరిగా పండక అవస్థలు పడుతున్నాం. ఇలాంటి పరిస్థితిలో ధరలు పెరగడం సామాన్యులపై భారం మోపడమే. నిత్యావసర సరుకులు, నూనెల ధరలు పేదలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – కృష్ణానాయక్, మిద్దెతండా,తుగ్గలి మండలం

### నూనెల ధరలు పెరిగాయి



కేంద్రప్రభుత్వం చమురుపై దిగుమతి సుంకాన్ని పెంచడంతో నూనెల ధరలు అమాంతం పెరిగాయి. ధరల పెంపుతో వ్యాపారాలు బాగా తగ్గిపోయే ప్రమాదముంది. లీటరుపై రూ.20పైగా పెరిగింది. పామాయిల్ లీటర్‌కు రూ.18 నుంచి రూ.20 వరకు, సన్‌ఫ్లవర్ నూనె రూ.21 నుంచి రూ.24 వరకు పెరిగింది.

– ఈర్లదిన్నె రమేష్, కిరాణా వ్యాపారి, పత్తికొండ

# మీరు మారరా?

- నగరడోణ, చిప్పగిరి గ్రామాల్లో సచివాలయాలకు నూతన భవనాలు
- ప్రారంభించిన అధికారులు
- వాటిల్లోకి చేరని అధికారులు, సిబ్బంది
- ఉన్నతాధికారులు ఆదేశించినా బేఖాతరు
- నిరుపయోగంగా మారిన నిర్మాణాలు



ఇరుకుగా ఉన్న చిప్పగిరి గ్రామ పంచాయతీ భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది..(ఫైల్)



నగరడోణలో వినియోగానికి నోచుకోని గ్రామ సచివాలయ భవనం



చిప్పగిరిలో నిరుపయోగంగా నూతన గ్రామ సచివాలయ భవనం

**చిప్పగిరి:** అన్ని వసతులు కల్పించి రూ.లక్షలు వెచ్చించి మీరు విధులు నిర్వర్తించేందుకు నూతన భవనాలు నిర్మించి ఇస్తామంటే సాధారణంగా ఉద్యోగులు సంబరపడతారు. అయితే ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు చిప్పగిరి, నగరడోణ గ్రామ సచివాలయ అధికారులు. ఆధునిక వసతులతో రూ.40 లక్షలకు పైగా వెచ్చించి ఒక్కో భవనాన్ని నిర్మించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. పనులు పూర్తవడంతో ఏడాది క్రితం ప్రారంభోత్సవం కూడా చేశారు. ఇందులోనే విధులు నిర్వర్తించాలని అధికారులు సైతం ఆదేశించారు. ఇరుకు గదుల్లో సేవలు పొందలేక ఇబ్బందులు పడిన ప్రజలు కూడా కొత్త భవనాల్లో పాలన అందుతుందని ఆశగా ఎదురుచూశారు. అయితే.. ఆయా గ్రామ సచివాలయ అధికారులు మాత్రం నూతన భవనాల్లోకి చేరడం లేదు. ఇందుకు ప్రత్యేక కారణాలేవైనా ఉన్నాయా అని ప్రశ్నిస్తే వారి నుంచి సమాధానం కరువైంది. పాత కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో వారి అంతరంగం అర్థం కాక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని 16 గ్రామాలకు రూ.3.60 కోట్లతో గ్రామ సచివాలయాలు నిర్మించాలని నిధులు విడుదల చేసింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. మండల కేంద్రం చిప్పగిరితో పాటు ఏరూరు, డేగులపాడు, గుమ్మనూరు, దౌల్తాపురం, బెల్డోణ, నగరడోణ, రామదుర్గం, నేమకల్లు, గ్రామాల్లో ఒక్కో భవనానికి సుమారు రూ.40 లక్షలు వెచ్చించారు. వీటిల్లో 5 భవన నిర్మాణాలు పూర్తవడంతో ప్రారంభోత్సవం చేశారు. వీటిలో నేమకల్లు, దౌల్తాపురం, ఏరూరు భవనాల్లో సిబ్బంది చేరి ప్రజలకు సేవలందిస్తున్నారు. మిగిలిన నగరడోణ,చిప్పగిరిలోని నూతన భవనాలను సిబ్బంది వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారడంతో పాటు వాటి చుట్టూ ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.

### భవనాలను వినియోగించుకోవాలని ఆదేశించాం

చిప్పగిరి,నగరడోణ గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయ్యి ప్రారంభోత్సవం జరుపుకున్న నూతన గ్రామ సచివాలయాలను వినియోగించుకోమని ఆయా గ్రామ సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఆదేశాలు ఇచ్చినా ఎందుకు వినియోగించడం లేదో విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటాం. – సి.వి.కొండయ్య, ఎంపీడీఓ



హొళగుందలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

# సూపర్ సిక్స్ ఎక్కడ బాబూ?



ఫాతెహాల్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

**హొళగుంద:** ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అన్నావు.. ముఖ్యమంత్రి పీఠమెక్కి మూడు నెలలవుతున్నా వాటి ఊసే లేదు..నీ నైజం ఇదే చంద్రబాబు..ఇచ్చిన హామీ ఏనాడు నెరవేర్చలేదని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. శనివారం బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కృష్ణమోహన్‌తో కలిసి స్థానిక తేరుబజారులో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాడు ఓట్ల కోసం అమ్మకు వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు అంటూ ఊదరగొట్టి..నేడు నిధుల లేమిని బూచిగా చూపి అమలును గట్టెక్కించారని మండిపడ్డారు. అయితే.. తమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాటి ఎన్నికల సమయంలో చెప్పిన వాటిల్లో 99 శాతం నెరవేర్చి చిత్తశుద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని కొనియాడారు. హొళగుంద నుంచి ఢణాపురం వరకు రోడ్డు అధ్వానంగా ఉండటంతో బస్సులు రద్దవుతున్నాయన్నారు. దీనిపై అనేక సార్లు కాంట్రాక్టర్ వెంట పడినా అంచనా పెరగడంతో ఆయన ముందుకు రావడం లేదన్నారు. దీంతో తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు కోగిలతోట శేషప్ప, మాజీ సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున, ఎస్కే గిరి, ఎంపీటీసీ మల్లి, హనుమప్ప, వెంకటరెడ్డి, కృష్ణ మోహన్, రామకృష్ణ, వెంకట్రామిరెడ్డి, రవిస్వామి, పంపాపతి, కాకి ఫక్కీరప్ప, శంకర్, రంగస్వామి, మంజునాయక్, దర్గన్న, సిందువాళ కృష్ణయ్య, సోమిరెడ్డి, నాగప్ప, చంద్ర, వెంకటేష్, పల్లి ఈరన్న పాల్గొన్నారు.

**ఎల్లార్తి దర్గాలను దర్శించుకున్న ఎమ్మెల్యే**

ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలను ఎమ్మెల్యే పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక ఫాతెహాలు అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. తదనంతరం ఈ నెల 29 నుంచి మొదలయ్యే ఎల్లార్తి ఉరుసు పోస్టర్లను విడుదల చేశారు. అలాగే..ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్యాట శ్రీరంగ, మండలధ్యక్షుడు కాకి గాదిలింగ ఎమ్మెల్యేను కలిసి మండల కేంద్రంలో ఎస్సీ బాలుర వసతి కేంద్రాన్ని పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వక్ఫ్ బోర్డు సవరణ చట్టం -2024ను ఉపసంహరించుకునేలా తమవంతు సహకారం అందించాలని మాషా అల్లా గ్రూపు సభ్యులు కోరారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

# సత్వర న్యాయానికి లోక్ అదాలత్



పత్తికొండలో లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి ఎస్ఎస్. భారతి



లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి కట్ట హేమ

**పత్తికొండ(తుగ్గలి) :** వ్యాజ్యాన్ని కొనసాగించడం కంటే న్యాయ పరిధిలో రాజీ చేసుకోవడం ఉత్తమ మార్గమని, సత్వర న్యాయానికి లోక్ అదాలత్ ఉత్తమ వేదిక అని జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె పాల్గొని రాజీ కుదిర్చి పలు కేసులను పరిష్కరించారు. జడ్జి మాట్లాడుతూ..లోక్ అదాలత్‌లో సత్వర నాయం జరుగుతుందని, ఎవరూ గెలవడం, ఓడడం అనేది ఉండదన్నారు. ఇందులో రాజీ అయిన కేసులకు అప్పీలు చేయడానికి ఉండదన్నారు. కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకుంటేనే ఉత్తమమన్నారు. లోక్ అదాలత్‌లో మొత్తం 84 కేసులు పరిష్కారం కాగా.. ఇందులో క్రిమినల్ కేసులు 54, సివిల్ కేసులు 14, ఈపీ కేసులు 11, గృహహింస 3, భరణం కేసులు 2 ఉన్నట్లు క్లర్క్ రాఘవేంద్ర వెల్లడించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, లోక్ అదాలత్ న్యాయవాదులు నాగభూషణరెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

**ఆలూరు:** కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని ఆలూరు సివిల్ జూనియర్ కోర్టు న్యాయమూర్తి కట్టహేమ సూచించారు.స్థానిక జూనియర్ కోర్టు ఆవరణలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 59 వివిధ రకాల కేసులను పరిష్కరించారు. ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాయుజీవోత్తం రావు, షేక్షావలి,లక్ష్మీకాంతం, విజయ్ భాస్కర్, రాజేష్‌నాయకుడు ,వీరేష్ పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**పత్తికొండ(తుగ్గలి) :** ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు రాజాసాహెబ్, జిల్లా కార్యదర్శి పంపన్‌గౌడ్ కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. జూలైలో అనావృష్టి, ఆగస్టులో అతివృష్టి కారణంగా సాగు చేసిన పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఉచితంగా విత్తనాలు, ఎరువులతో పాటు పరిహారం అందించి, ఖరీఫ్ పంట రుణాలు మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సహకార బ్యాంకుల్లో రబీలో పంట రుణాలు ఇవ్వాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు చెప్పారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు సురేంద్రయాదవ్, మల్లికార్జునయాదవ్, రమేష్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి భరోసా

**పత్తికొండ(తుగ్గలి) :** మూడు రోజుల క్రితం పట్టణంలోని చాకలి వీధిలో నివాసముండే వీరేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లవానిపల్లి వెంకటేశ్వరరెడ్డి స్థానిక టైలర్లతో కలిసి శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుడి సోదరుడు సురేష్‌కు ఆర్థిక సాయం అందించారు. టైలర్లు రంగన్న, సుంకన్న, చుక్కప్ప, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

## నిందితుల అరెస్ట్

**పెద్దకడబూరు :** కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి దళిత మహిళపై దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నిందితుల్లో కొందరు చాకలి నాగరాజు, హుసేని, రాముడు, భీమరాజును శుక్రవారం రాత్రి అరెస్టు చేశామని, వారిని ఆదోని రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట శనివారం హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించారని చెప్పారు. నిందితుల్లో మిగిలిన వారిని చాకలి భూలక్ష్మి, నరసమ్మ, లక్ష్మి, పెద్ద రంగమ్మ, గుండమ్మ శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు వివరించారు. నిందితులందరినీ అరెస్టు చేసి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు.

## కొనసాగుతున్న స్టాఫ్‌నర్సుల ఆందోళన

**ఆదోని టౌన్:** స్థానిక ప్రభుత్వ ఆస్పత్రులో స్టాఫ్‌నర్సుల ఆందోళన శనివారంతో మూడో రోజుకు చేరుకుంది. ఉదయం సర్వజన ప్రభుత్వ ఆస్పత్రి, స్త్రీల, చిన్నపిల్లల ఆస్పత్రి వద్ద వేర్వేరుగా స్టాఫ్‌నర్సులు ఆందోళన చేశారు. 15 నుంచి 20 యేళ్లుగా తాము ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ప్రజలకు సేవలు అందిస్తున్నామని, తమ సేవలను ప్రభుత్వం గుర్తించకుండా తమ స్థానంలో 18 నెలలు శిక్షణ పూర్తి చేసిన కొత్త స్టాఫ్ నర్సులను తీసుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

# నిందితులను తక్షణమే శిక్షించాలి



ఆలూరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

**ఆలూరు:** పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత గోవిందమ్మపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌వద్ద సంఘం అధ్యక్షుడు కత్తి రామాంజనేయులు,ఉపాధ్యక్షుడు నరసప్ప ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

**వెల్దుర్తి:** కల్లుకుంట గ్రామంలో దళిత మహిళను స్తంభానికి కట్టేసి దాడికి పాల్పడిన నిందితులను తక్షణం అరెస్టు చేసి శిక్షించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాతబస్టాండులో సంఘం ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మహిళను హింసించడం నీచమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. టైలర్ రాముడు, ఎల్లకృష్ణ, చిన్న అయ్యన్న, పుల్లయ్య, పెద్ద రంగడు పాల్గొన్నారు.

# భక్తుల ఆరాధ్య దైవం.. చౌడేశ్వరీ దేవి

- కోర్కెలు నెరవేర్చుతున్న అమ్మవారు
- 16 నుంచి రెండు రోజుల పాటు పత్తికొండలో జ్యోతుల ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ



పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయం



అమ్మవారి మూలవిరాట్

**పత్తికొండ(తుగ్గలి):** మహిమ గల తల్లిగా ప్రసిద్ధిగాంచింది పట్టణంలోని రెడ్డిబావి వీధిలో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయం. కోరిన కోర్కెలు నేరవేరుతండడంతో ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. భక్తుల పాలిట ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్న అమ్మవారి జ్యోతుల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

**ఆలయ విశిష్టత..**

1862లో రెడ్డిబావి వీధిలో తవ్వకాలు జరుపుతుండగా లభ్యమైన బచ్చన్న చౌడమ్మ విగ్రహం 164 ఏళ్లుగా పూజలందుకుంటోంది. అమ్మవారి నూతన విగ్రహాన్ని 40 ఏళ్ల కిందట భక్తులు ప్రతిష్ఠగావించారు. కొలిచిన వారికి కొంగు బంగారంగా చౌడేశ్వరీ మాత భక్తుల పాలిట ఇలవేల్పుగా పూజలందుకుంటోంది. తమ కులదైవమైన అమ్మవారు ఎల్లప్పుడూ సల్లంగా చూస్తుందని తొగటవీర క్షత్రియులు, భక్తుల విశ్వాసం. ఏటా మహాలయ పౌర్ణమికి రెండు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తారు. అదే రోజునే పట్టణవాసులంతా మహాలయ పౌర్ణమిని జరుపు కోవడం ఆనవాయితీగా వస్తోంది.

**ఉత్సవాల నిర్వహణ ఇలా..**

అమ్మవారి ఉత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వేకువ జామున అమ్మవారికి అభిషేకాలు, అర్చన, పూజా కార్యక్రమాలు, మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 5గంటలకు పూజా కార్యక్రమం, 7గంటలకు గణము, గంగపూజ, 8గంటలకు మంగళహారతి, 17న వేకువజామున తొగటవీర క్షత్రియుల సంఘం ఆధ్వర్యంలో జ్యోతుల మహోత్సవాన్ని పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు, మంగళహారతి కార్యక్రమాలతో ముగుస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. జ్యోతుల మహోత్సవానికి జిల్లాలోని వెలుగోడు, ఆత్మకూరు, అనంతపురం జిల్లా తాడిపత్రి, యాడికి, చిన్నపడమల తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, భజన బృందాలు పాల్గొననున్నాయి.

## భజన విజేత కడిమెట్ల

**ఆస్పరి:** మండలంలోని కారుమంచి గ్రామంలో దక్షిణామూర్తి స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి జిల్లా స్థాయిలో నిర్వహించిన భజన పోటీల్లో మొదటి విజేతగా కడిమెట్ల నిలిచింది. భజన పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. మొదటి స్థానం కడిమెట్లకు రూ. 15,116వేలు, ఆ తరువాత వరుసగా.. లక్ష్మీపల్లెకు రూ.12,116, సాతర్లకు రూ.9,116, పుప్పాలదొడ్డి రూ.7,116, ఐదు గుత్తి ఆర్ఎస్‌కు రూ.6,116, ఆరు గోపరాజుపల్లెకు రూ.5,116, ఏడు పుటకలమర్రికు రూ.4,116, ఎనిమిది దొడగొండ, హలిగేర జట్లుకు రూ. రూ. 5,632, తొమ్మిది డీ.కోటకొండ, బనవనూరు జట్లకు రూ.3,632, ములుగుందంకు రూ.1,116, 11వ స్థానంలో నిలిచిన తురువగల్లుకు రూ.1,016, 12,13 స్థానంలో నిలిచిన గూడూరు, ములుగుందం జట్లుకు ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ప్రసాద్, తిరుపాల్, రామలింగయ్య, వెంకట్ వ్యవహరించారు.

## ఆటో, స్కూటర్ ఢీ

**కృష్ణగిరి:** మండలంలోని కంబాలపాడు నుంచి డోన్‌కు వెళ్లే దారిలో శనివారం సాయంత్రం స్కూటర్, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో స్కూటర్‌పై వెళ్తున్న పెనుమాడ గ్రామానికి చెందిన బోయ మధు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

**మద్దికెర :** మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి మద్దికెర గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజన్నయాదవ్, మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడు, కుటుంబసభ్యులు రూ.1,11,116 విరాళాన్ని శనివారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

### ఘనంగా హిందీ దివస్



హిందీ టీచర్‌ను సన్మానిస్తున్న విద్యార్థినులు

**వెల్దుర్తి:** స్థానిక సత్యసాయి హైస్కూల్‌లో శనివారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. కరెస్పాండెంట్ రమణ, హెచ్‌ఎం గఫూర్ ఆధ్వర్యంలో హిందీ టీచర్లు షాహిదా, నఫీసాలను సన్మానించారు. హిందీలో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులందించారు.డైరెక్టర్ తిప్పారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కూర్మనారాయణ స్వామి

**ఆస్పరి:** మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మ నారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

### మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం



మల్లేష్ (ఫైల్)

**హొళగుంద:** లింగంపల్లి గ్రామానికి చెందిన మల్లేష అనే మతిస్థిమితం లేని యువకుడు 15 రోజుల నుంచి కనిపించడం లేదని ఆయన సోదరుడు గుడుదప్ప, కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 31న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, చుట్టు పక్కల గ్రామాల్లో, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.

### ఏచూరి మృతికి నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి:** సీపీఎం నేత సీతారాం ఏచూరి మృతి ఉద్యమానికి తీరని లోటు అని సీపీఎం జిల్లా నాయకుడు నగేశ్ అన్నారు. శనివారం స్థానిక మోటార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) కార్యాలయంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు రాజు, సీపీఎం మండల నాయకుడు మారెన్న ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లి, సత్యం, చిన్న ఏసు, బ్రహ్మం, కిట్టు, రాముడు, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

**మద్దికెర :** సీతారాం ఏచూరి మృతి తీరని లోటని, స్థానిక ప్రధాన బస్టాండు వద్ద శనివారం ఆపద్బంధు సేవాసమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. చొక్కా సునీల్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

### నేడు రాష్ట్రస్థాయి భజన పోటీలు

**కృష్ణగిరి:** మండలంలోని పుట్లూరు గ్రామంలో మారెమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ. 20వేలు, రూ.15 వేలు, రూ.12వేలు, రూ.10 వేలు,రూ.8 వేలు, రూ. 6వేలు, రూ.5వేల నగదు అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు సెల్ 9989272156, 9014919781, 9398641704 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### 99 శాతం పంట నమోదు

**కృష్ణగిరి:** ఖరీఫ్ పంటల నమోదు ఇప్పటి వరకు 99 శాతం పూర్తయినట్లు ఏఓ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఆదివారం నాటికి పంట నమోదు కార్యక్రమం ముగుస్తుందని, ఇంకా ఎవరైనా నమోదు చేయించని రైతులుంటే ఆయా గ్రామాల్లోని వీఏఏలతో చేయించుకోవాలని సూచించారు. అలాగే ఫార్మర్ ఈ-కేవైసీ 53 శాతం పూర్తయిందన్నారు. వీఆర్వోలు, వీఏఏలు పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ కూడా చేయాలని ఆదేశించామని చెప్పారు.